**ఇతరుల్ని ప్రేమించడమేగాక ఇతరుల్నుంచీ ప్రేమను పొందాలని వుంటుంది మనిషికి. అందువల్ల, మనిషినో, మాకునో ఆ ప్రేమకు ఆధారంగా నిలుపుకోక తప్పదేమో!**

ఆకు రాలే కాలం.

విశాలమైన స్థలంలో ఎత్తుగా, ఏపుగా పెరిగిన ఆ మామిడిచెట్టు విపరీతంగా ఆకులు రాలుస్తోంది. ఏ వేళా పచ్చగా, గుబురు కొమ్మలతో నిండి తన చుట్టూ చేరేవారికి చల్లని నీడని ఒసగే చెట్టు, కాలధర్మంగా ఇప్పుడు దీని ఆకులన్నీ ఎండి వలవలా రాలిపోతున్నాయి. చెట్టు మొదట్లో చుట్టూ విపరీతంగా చెత్త పేరుకునిపోయింది. ఎండిన ఆకులు ఒత్తుగా పరుచుకుని చిరుగాలి కదలికలకే గలగలా శబ్దం చేస్తున్నాయి.

# జీవితం - ప్రేమ = ?

## కాకాని కమల

తన ఇంటి ముంగిట నవారు మంచంలో కూర్చుని, ఆ ఎండిన ఆకుల సవ్వడులు వింటూ ఆ చెట్టుకేసే చూస్తోంది సంధ్య.

"సంధ్యా! నన్ను చూడు" అని దీనంగా ఆ చెట్టు అడుగుతున్నట్టు సంధ్య మనసు ప్రతిక్షణం కలవరపడుతోంది.

నిపుడు తన చేతుల్తోనే స్వయంగా ఆ చెత్తంతా ఎత్తిపోసి నీళ్ళుజల్లి శుభ్రం చేసింది సంధ్య కాని ఇప్పుడు ఆమె ఒంట్లో అంత ఓపికలేదు. జవసత్వాలు వుడిగిపోయాయి. కంటిచూపు పూర్తిగా మందగించింది. ఏఏటికాయేడు సంధ్యకి వయసు పైబడుతోంది. ఆ ఆకుల్లాగనే ఆమె బ్రతుకు పండిపోయింది. ఎప్పుడో రాలిపోక తప్పదు

సంధ్య ఒంటరి పిట్ట.

ఏదో.... ఇంత వున్నది వండుకోవటం ఆకలేస్తే తిన్నాను అని తృప్తిపడడం నిద్రవస్తే పడుకోవటం.

మిగతా తీరిక సమయం అంతా యిదిగో యిలా తన యిల్లు అనుకునే ఆ చిన్న గుడిసె... ఊహుఁ....కాదు ఆ యింటి యజమాని భాషలో అది గుడిసె. కాని... సంధ్య దృష్టిలో అది అతి ప్రశాంతమైన పర్ణశాల! ఆ సుందర కుటీరం ముందు కూర్చొని ఆ మామిడి చెట్టుని చూడటం.

అంతే

తెల వారుతుంది.

ప్రొద్దు క్రుంకుతుంది.

సంధ్యకి రోజు గడుస్తుంది.

భగవంతుని పిలుపుకోసం మళ్ళీ ఎదురు చూపు.

ఇదే ఆమె దైనందన జీవితం

ఆమె ఒంటరి చందు జీవితంలో ఆ మామిడిచెట్టు ఎంతో ఆత్మీయురాలు. బంధువు. మిత్రుడు. బిడ్డా పాప- అన్నీ ఆ చెట్టే. అన్ని అనుభూతులు ఆ చెట్టులో చూసి వూహించుకుని మురిసిపోతుంది. వినేవాళ్ళకి వింతే. కాని.... ఆమె అంతరాత్మ అబద్ధం చెప్పదుకదా?

"మామిడిచెట్టుని అల్లుకున్నది మాధవీలతొకటి ఏమా రెండిటి ప్రేమా ఇంతింతనలేము...." అన్నంత గొప్పది సంధ్యకి ఆ చెట్టుతో అనుబంధం.

సంధ్య లాగే ఆ చెట్టుకి వయసు అయిపోయింది. దాని ఆకులన్నీ పండి రాలిపోతున్నాయి.

అయితే మాత్రం ఏం?

మళ్ళీ వసంతానికి చేవదేలి పచ్చగా చిగురు తొడుగుతుంది. పూత పూస్తుంది. గుత్తులు గుత్తులుగా పిందెలు వేస్తుంది. నవవసంత శోభతో కొత్త పెళ్ళికూతురులా కళకళ లాడుతుంది.

కాని.... సంధ్య?

ఆమెకేముంది చూసి మురిసిపోవటానికి?

మోడు మళ్ళీ చిగురుస్తుంది.

బీడు మళ్ళీ మెలకేస్తుంది.

కాని....

"ఆ చెట్టుకున్న సౌభాగ్యం తనకెందుకు లేకుండా పోయింది?"

అశాంతిగా కళ్ళు మూసుకుంది సంధ్య.

"ఆడదిగా పుట్టటం కంటె అడవిలో మ్రానుగా పుట్టటం నయం అంటారు. ఇందుకేనా?"

గత ఆరేళ్ళుగా ఈ చెట్టు నీడన ఈ పూరింట్లో సంధ్యకి జీవితం అలవాటు అయిపోయింది. ఈ లోకం కంటె నోరూ వాయీ లేని ఈ చెట్టే తనని ఎంతగానో ఆదరించిందికదా అనిపిస్తుంది సంధ్యకి.

గుడిసె ముందు మంచం వేసుకుని విశ్రాంతిగా కూర్చుంటే ఎవరో కావాలని గురిచూసి విదిల్చినట్లు మామిడి కాయలు రాలి వొళ్ళో పడేవి.

సంధ్య వులికిపాటుగతలయెత్తి చూస్తే- మామిడిచెట్టు ఆపేక్షగా చిరునవ్వు నవ్వినట్టు సన్నగా ఆకులు కదిల్చి-

"సంధ్యా! తీసుకో. నీకోసమే" అన్నట్లు పలికేది.

సరిగ్గా ఆరు సంవత్సరాల క్రితం టీచరుగా ఆ ఊరికి బదిలీఅయి వచ్చింది. ఇల్లు కోసం గాలిస్తుంటే ఈ మామిడిచెట్టు కింద పూరిల్లు అద్దెకిస్తారని తెల్సింది.

ఆ ఇంటి కామందుని వెళ్ళి అడిగితే, ఒక్క నిమిషం ఆశ్చర్యంతో నోరు తెరిచి ఆ తరువాత రెండు చేతులూ జోడించాడు.

"పంతులమ్మగోరూ! మీరు సదువుకున్నోరు- పైగా బావనోరం అంటున్నారు ఈ గుడిసెలో వుండలేరు తల్లి." అన్నాడు ఇబ్బందిగా మొఖంపెట్టి.

సంధ్య నవ్వింది

"ఇన్నాళ్లూ తను బంగళాల్లోనే వుంది కదా? ఏం బావుకుంది?"

ఎత్తుగా విస్తరించి వున్న ఆ మామిడి చెట్టు.... చల్లనిగాలి.... దానికింద పర్ణకుటీరంలావున్న ఆ గుడిసె ఆమెకి ఎంతగానో నచ్చాయి.

తుఫాను గాలులకి అల్లకల్లోలం అయిన ప్రకృతి ప్రశాంతత కోసం పరితపిస్తుంది.

చివరికి ఎలాగో ఆ కామందుని ఒప్పించి నెలకి పదిహేను రూపాయలు బాడుగకి ఆ గుడిసెలోకి దిగింది.

రెండు సంవత్సరాల క్రితం రిటైర్ అయ్యింది. అయినా శేష జీవితం అక్కడే గడిచి పోవాలని నిర్ణయించుకుంది.

—"నాది" అనుకున్న ఊరు "నా" అనుకొన్నవారు సంధ్యకి యెవరున్నారని?

"నీ వారూ నా వారూ
నెత్తిన నిప్పులు పోశారే
కత్తులు గుండెలో గుచ్చారే
నెత్తుటిలో ముంచెత్తారే...." అన్నట్టు

అయినవాళ్ళందరూ తనని అన్యాయమే చేశారు. కన్నవారూ కట్టుకున్నవారూ తనకి ఏం ఒరగబెట్టారని, తనకోసం ఎవరు ఒక కన్నీటిచుక్క రాల్చారని?

—అందుకే.... ఏమీకానివాళ్ళనే అయిన వాళ్ళని తృప్తిపడింది సంధ్య

పొట్టకూటి కోసం ఉద్యోగం చేసింది. ప్రభుత్వం ఏ ఊరికి పంపితే ఆ ఊరే తనది అనుకుంది. చివరికి ఇక్కడికి చేరుకుంది. ఇక్కడే పిడికెడు బూడిదగ మిగిలిపోవాలని కూడా నిర్ణయించుకుంది గుడిసెలో కాపురం వుంటున్నానన్న దిగులు ఆమెకి ఏనాడూ కలుగలేదు

అందాల బొమ్మలా నిగనిగలాడుతూ పరువాల పల్లకిలో వూరేగే తరుణంలో రెండంతస్తుల మేడలోసంపన్నుని భార్యగా పది సంవత్సరాలు బ్రతికింది, కాని.... ఏం సుఖపడింది?

"తొలిరేయి విరిపాన్పు
ముళ్ళనే పరిచింది
కసటు కోరిక మగని రూపాన
నిలిచింది...." అన్నటు కోటి కోర్కెలతో రంగు రంగుల కలలతో కాపురానికి వచ్చిన సంధ్యకి భర్త క్రూరత్వాన్నే ఎవిచూపాడు. అతనిలోని "శాడిస్టు" ఆమెలోని సున్నితమైన మనస్సుని కాల్చి తినేశాడు రోజులు గడుస్తున్నకొద్దీ సంధ్యకి కంటివెంట నీరుకూడా వచ్చేది కాదు

సంధ్య భర్త ... ఆమె కళ్ళముందే విచ్చలవిడిగా వ్యభిచరించేవాడు. తాగి ఖాళీచేసిన బాటిల్సుని కసాయితనంగా సంధ్య తలకి తగిలేలా గురిచూసి విసిరేవాడు. ఎన్నోసార్లు ఆ బ్రాందీసీసాల వాడి గాజు పెంకులు ఆమెర క్తాన్ని చవిచూశాయి.

అదంతా "నరకం"!

"పీకల"!! !

మళ్ళీ ఎలా తల్చుకోవటం?

స్వీట్ సమ్‌థింగ్!

స్వీట్ నథింగ్స్!!

తియ్యని అనుభూతులు.!!!

మరుపురాని అనుభవాలు.... అంటారే. అవి అటువంటివి -మళ్ళీ మళ్ళీ తల్చుకోవాలి కాని....వ్చ్ అవి సంధ్యకేవి? అందరూ ఆమె మనసుని నిర్దాక్షిణ్యంగా నులిమివేశారు. ప్రేమరాహిత్యాన్నే చవి చూపారు.

"ఏమి జీవితం తనది?"

సంధ్య అరచేత్తో గుండెలమీద రాసుకుంది.

ఆమెకి ఊహ తెలిసే నాటికే "అమ్మ" స్థానంలో పిన్ని తండ్రి పరాయివాడయి పోయ్యాడు.

అందుకే....

ఫ్రెండ్స్ అందరూ పెద్ద చదువులు చదివి గొప్పవాళ్ళు కావాలని కలలు కంటె సంధ్య మాత్రం 'పెళ్ళి'చేసుకోవాలి అనుకుంది. 'నా ఇల్లు. నా భర్త. నా పిల్లలు' అన్న మమకారం కోసం తపించింది

ఆమె పద్దెనిమిదవ ఏట పెళ్ళిజరిగింది. కాని ఇక్కడా ఆమెకి చుక్కే ఎదురు అయింది


"డబ్బు కాశపడి పిన్నితో కల్సి నాన్న నా గొంతు కోశాడు." అని దుఃఖించింది.


"ప్రతీ కన్న తండ్రి తన కూతురు సుఖపడాలి అనుకుంటాడు కాని మా నాన్న!" అనుకుంది వెర్రిగా

తాంబూలాల రోజు పెళ్ళి కూతురు ముస్తాబులో కూడా సంధ్య ఏడుస్తూనే వుంది

పిన్ని ఆరోజు కూడా ఆమెని బుగ్గ పోట్లు పొడిచింది, భుజాలు గిచ్చింది.

"ఏం రోగం? నయాపైసా కట్నం లేదు. ఒంటినిండా నీకే యెదురు నగలు పెడుతున్నారా- మావ లేనేలేడు ఇవాళో రేపో గుటుక్కుమనేటట్లుంది నీ అత్త. ఏకైక వారసుడు అందగాడు అయిన





లక్షాధికారికి భార్యవి కాబోతున్నావ్. ఏడవటానికి రోగమా? తెగులా? బంగారం లాంటి సంబంధం నీకు చేదు విషం అయిందా? పెళ్ళికొడుకు కాస్త నలుపు అయితే మాత్రం ఏం? నీ తెలుపు అతనికి అంటించు...." అని ఎకసెక్కం ఆడింది.

పాతికేళ్ళ పిన్ని యాభై ఏళ్ళ నాన్నని చేసుకున్న అక్కసంతా తన మీద కక్కపోసింది.

"డబ్బులేక నేను రెండో పెళ్ళివాడ్ని ముసలాడ్ని.... అదేలే మీ నాన్నని కట్టుకున్నాను నీకు డబ్బుతోపాటు కోడె వయసుతో మిడిసిపడే జోడు కూడా చూశాను. ఇంకా ఏడవటానికేం ఖర్మ? హాయిగా అనుభవించలేకనా?" అని కూడా పచ్చి పచ్చిగా తిట్టింది.

నిజమే

నాన్నతో పోల్చుకుంటే "అతను" అన్నివిధాల వున్నతుడే ముసలివాడు కాడు. రెండో పెళ్ళి అసలే కాదు ఆరాయించుకోలేనంతగ ఆస్తిపాస్తులు. కాని .. కాని ....చీడపట్టిన చెట్టు యెన్నాళ్ళు పచ్చగా వుంటుంది?

అయినా తన హృదయ ఘోష యెవ్వరికీ వినిపించలేదు.

పెళ్ళయిన మూడవరోజే కాపురానికి వెళ్ళింది.

లేతపిల్ల .... కొత్తభార్య అన్న కనీస మోజు లేకుండా తనభర్త తనపై "అధికారం" చూపించాడు. "ధనదర్పం" ప్రదర్శించాడు

"అయ్యో! తన భార్యకి తనపై ప్రేమ చచ్చిపోతుందేమో....!" అన్న భయం లేదుసరికదా—

"నీ ప్రేమ లేకపోతే నాకు వచ్చిన లోటేమీలేదు." అన్నట్లు విపరీతమైన నిర్లక్ష్యంగా వుండేది అతని ప్రవర్తన. తన లేత మనసు. లేత వయసు రెండూ మాడి మసి అయిపొయ్యాయి అతడి సాహచర్యంలో.

సంపెంగ పూలకి ఆశపడితే విషపునాగు కాటేసినట్లు అయింది తన పరిస్థితి. అతడితో పదిసంవత్సరాల కాపురం ఎలా చేసిందో భగవంతుడికి తెలుసు. ప్రతి క్షణం ఏదో రకంగా నరకాన్ని చవి చూపాడు గుడ్డిలో మెల్లగా పిల్లలు లేరు. ఆ తరువాతే విసిగిపోయి అతడ్నుంచి తను విడిపోయింది. నిజానికి ఆయన పొమ్మనలేదు. కాని.... తను వుండాలన్న ఆపేక్ష కూడా ఆయనకు లేదు. మొదట్నుంచి

వుంటే వుండు పోతే పో అన్న పద్ధతే అనుసరించాడు

అందుకే ఎంతో ఆలోచించినమీదట తనే అటువంటి నిర్ణయానికి వచ్చింది. పరాయి పంచన పరమాన్నం తినటం కంటె తనదైన గంజి తాగటం మేలని పించింది. కావటానికి అతను "భర్తే". అయినా అతను తనకి ఏమీ కాని పరాయి వాడిలాగనే మిగిలి పొయ్యాడు. డబ్బిచ్చి కిరాయికి తెచ్చుకున్న బజారు ఆడవాళ్ళతో లోకువగా గడిపినట్లే "వెరైటీ" కోసం కొన్ని రాత్రులు తనతోనూ గడిపాడు. అంతకు మించి ఆత్మీయత తమ మధ్య పొసగలేదు. ప్రేమ, అభిమానం లేకుండా కసాయితనం మాత్రమే వున్న వాడు భర్త అయితే నేమిటి కాకపోతే నేమిటి? అందుకే కదా.... మనసు విరిగి తను విడి పోవటానికి నిర్ణయించుకుంది.

అప్పటికే నాన్న చనిపోయాడు. వున్న కొద్దిపాటి ఆస్తి ఇల్లు పిన్ని స్వంతం అయ్యాయి. తన బి.ఎ డిగ్రీయే తనకి అండగా నిలిచి టీచరు ఉద్యోగం ఇప్పించింది. అప్పుడప్పుడూ బదిలీలు అవుతూ తను ఊళ్ళు మారుతోంది. ప్రైవేటుగా ఎమ్. ఎ. చేసి ట్రైనింగ్ కూడా అయింది.

కారుచీకట్లోకి కాంతిరేఖ చొచ్చుకుని వచ్చినట్లు అప్పట్లోనే మోహన్ తన జీవితంలోకి ప్రవేశించాడు అతి చాకచక్యంగా సమ్మోహనంగా తన మనసుని బలంగా ఆక్రమించుకున్నాడు "ప్రేమంటే యిదేనేమో!" అన్న తియ్యని భ్రమలో తనని ముంచి సమ్మోహ పరిచాడు. ఎండిన తీగ నీరు తగిలి చేవదేలి చిగిర్చి మొగ్గ తొడిగినట్లు....తన హృదయం పులకరించింది. అతని సాహచర్యంకోసం పరితపించింది.

పెళ్ళి చేసుకుంటానని తనకి తనే ప్రమాణం చేశాడు. నమ్మకంగా తనలో ఆశలు రేకెత్తించాడు

"సంధ్యా! ఐ లవ్ యూ డీప్లీ..." అన్నాడు

"ఐ లవ్ యూ డెడ్లీ...." అన్నాడు.

రిజిస్టరు ఆఫీసుకి వెళదాం అని తొందర చేశాడు.

అతడి కళ్ళలోని 'సిన్సియారిటీ' తనని కదిలించింది. అతడి ప్రేమ నిజమేనేమో అని ఆశపడింది. తన మెడలోంచి లాకెట్ గొలుసు తీసి "లాకెట్ ఓపెన్" చేసింది రెండు చిన్న మంగళ సూత్రాలు ముడి పెట్టి వున్నాయి.

మోహన్ విభ్రాంతుడయ్యాడు. రిచ్చ పడ్డాడు

"సంధ్యా!?"

"అవును మోహన్! నాకు పెళ్ళయింది. మా ఇద్దరికీ సరిపడక విడి పొయ్యాం."

అంతే!

ఆ తరువాత పొరపాట్న ఎదురుపడినా చాలున ముఖం తిప్పుకుని తప్పించుకుందుకు ప్రయత్నించేవాడు తను వెంట పడలేదు.

విషాదంగా నవ్వుకుంది.

"గులాబి అందం కావాలి. గులాబి సొగసు కావాలి కాని ముల్లు గుచ్చుకోకూడదు!"

ఈ మగవాళ్ళని చూస్తుంటే నవ్వ వస్తుంది.

వాళ్ళ ఆలోచనలు. ప్రదర్శనలు మహా అద్భుతాలు! తన భార్య తన ఒక్కడికే స్వంతం కావాలి కాని పరాయి ఆడపిల్లలు అందరూ తనని చూసి మోహించాలి! ఇది వాళ్ళ సిద్ధాంతం ఇది వాళ్ళ నీతి. ఇలాంటి మగాళ్ళని చూస్తే మరి నవ్వు రాదా?

ఆ తరువాత తన జీవితంతో చెలగాటం ఆడాలని చాలామంది ప్రయత్నించారు. కాని అప్పటికే తన 'ప్రేమ' అంటే ఏమిటో తెలిసిపోయింది అది అసలు ఎంత బూటకం అయిన పదమో కూడా అర్థం అయింది

అందుకే తనచుట్టూ ముళ్ళకంచె కట్టుకుంది. ఎవర్నీ చేరనివ్వలేదు.

క్రమంగా తన యవ్వనం అంతరించింది. తనకి అలాంటి సమస్యలుకూడా అంతరించాయి.

ఆ తరువాత తన జీవితం... కలలో కూడా వూహించని విధంగా.... చిత్రంగా అనూహ్యమైన మలుపు తిరిగింది.

కాస్త దూరపు చుట్టరికంతో చెల్లెలు వరస అయ్యే సుశీల పరిచయం జరిగింది. పరిచయం అయి ఆరునెల్లు గడవకుండానే ఆమె కన్నుమూసింది ఆమెకి భర్త లేదు. వేరే దిక్కూ దివాణం లేదు. పోతూ పోతూ ఇద్దరు చిన్నపిల్లల్ని తన చేతుల్లో పెట్టి కన్నుమూసింది. తమ పరిచయం జరిగేనాటికే సుశీల ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింది. అసలు ఇలాంటి దూరపు ఆలోచనతోటే సుశీల కోరికోరి తనకు పరిచయం చేసుకుంది కాని ఆ విషయం తను చాలా ఆలస్యంగా తెల్సుకుంది.

ఆ చిన్న పిల్లలిద్దరి బాధ్యతా తప్పనిసరి అయినా సంతోషంగా స్వీకరించింది.

నేలని జీరాడుతున్న లతకి చిన్న ఆధారం దొరికినట్లు సంతోషపడింది.

మెట్రిక్ వరకు చదువు చెప్పించి మెకానిజంలో తర్ఫీదు యిప్పించింది. ఇప్పుడు వాళ్ళిద్దరూ పొరుగూళ్ళల్లో ఉద్యోగాల మీద వున్నారు. ప్రేమించి పెళ్ళిళ్ళు చేసుకొన్నారు. సుశీల ఆత్మ శాంతించి వుంటుంది.

కాని కనీసంగానయినా తనని పట్టించుకోవటంలేదు. అదే తల్చుకొంటే తనకి ఎంతో బాధ అనిపిస్తుంది వాళ్ళకి "తల్లి ప్రేమ" అంటే ఏమిటో బాగా తెలుసు తనపట్ల కేవలం కృతజ్ఞత- ఐదు సంవత్సరాలు తిండి పెట్టి సాకానన్న కృతజ్ఞత- అంతే.

కాని....

తనకి కావల్సింది కృతజ్ఞత కాదే!


"ప్రేమ....!"

ప్చ్... ప్రే....మ!

అంటే?

ఎడారిలో ఒయాసిస్సు.

అందని జాబిల్లి.



జీవిత చరమాంకాన్ని సంధ్యాపొద్దుతో పోల్చుకుంటారు.

సూర్యుడు పూర్తిగా అస్తమించాకవచ్చి చంద్రోదయం కాకపూర్వమే నిష్క్రమించే ఆ సంధ్య– అటు సూర్యుడికీ చెందక ఇటు చంద్రుడికీ చెందక కేవలం కొద్ది క్షణాలు మాత్రమే జగత్తుపై నర్తించి ఆహ్లాద పరిచే ఆ సంధ్య బ్రతుకు ఎంత అర్ధరహితం? ఎంత ప్రేమ రాహిత్యం?

తన పేరు సంధ్య.

తను ప్రేమించటమేగాని ప్రేమించబడలేక పోయింది. తన జీవిత విషాదం అంతా తన పేరులోనే యిమిడిపోయింది అనిపిస్తుంది. లేకుంటే తన బ్రతుకు యిలా యెందుకు అవుతుంది?

ఈ చరాచర సృష్టిలో చెట్టుకి, పుట్టకి, పిట్టకి కూడా ప్రేమ తెలుసు, మమకారం తెల్సు కాని.... కాని.... ఈ సంధ్య?

ఆఖరికి ఇక్కడికి వచ్చింది.

"రిటైర్ మెంటు స్టేజిలో కూడా ఈ బదిలీలు ఏమిటి?" అని విసుక్కుంది. కాని.... తప్పలేదు.

మూడు సంవత్సరాల క్రితం రిటైర్ అయింది. ప్రభుత్వం తరపున కొద్దిగా పెన్షన్ వస్తుంది.

"నౌకరీ అయిపోయిందికదా? ఇకనైనా మీ ఊరువెళ్ళు తల్లీ!" అన్నాడు ఇంటి ఆసామీ

"రమణయ్యగారూ! మీ ఇంట్లో నేను వుండటం మీకు ఇష్టంలేకపోతే చెప్పండి. వేరే ఇల్లు చూసుకుంటాను" అంది.

ఆ పెద్దమనిషి కంగారుపడ్డాడు. "ఎంత మాట అన్నావు తల్లీ! నా చెట్టులా నేనువ్వూ ఇక్కడ పచ్చగా మసలుతుంటే నా పూరిగుడిసెకే అందం వచ్చింది" అన్నాడు.

"రమణ్యగారూ! మీరు పెద్దవారు. మీకు నిజం చెప్తున్నాను. నాకు పిన్ని వుంది. భర్త వున్నాడు. పెంచిన పిల్లలువున్నారు. ఎవరి దగ్గరకి అయినా నేను వెళ్ళవచ్చు. కాని.... నాకు ఇష్టంలేదు వాళ్ళంతా "నా వాళ్ళు" అన్న భావం నాకు ఎప్పుడూ కలగలేదు. ఈ ఊరు వచ్చాను - నన్ను మీరందరూ ఆదరించారు. మీ చెట్టు నాకు చల్లని నీడనిచ్చి సేద తీర్చింది. తియ్యని పండ్లు నిచ్చి కడుపునింపింది. ఈ గుడిసే నా ఇల్లు, ఈ చెట్టే నా బంధువు అన్న భావంనాలోబలంగా చోటుచేసుకుంది. మీరు కాదంటే వెళ్ళిపోతాను కాని... ఈ గుడిసె ముందే, చెట్టుని చూస్తూ నా ఆఖరి శ్వాస విడవాలని నా కోరిక. దయతో కాదనకండి. అందుకు అవసరమైన డబ్బు కూడా బ్యాంకులో నిల్వ చేశాను ఓర్పుగా మీరంత కల్పి నాకు తుది వీడ్కోలు ఇస్తే చాలు...." రెండు చేతులూ జోడించింది.

చాలా రోజుల తరువాత హృదయం ఆర్ద్రం అయింది. ఎండిన బావిలో జల వూరినట్లు సంధ్య గాజుకళ్ళల్లో తేమ....

రమణయ్య చలించాడు.

"ఎంతమాట అన్నావు తల్లీ! నాకు మీరు భారంకాదు. నీ యిష్టం వచ్చినన్ని రోజులు వుండు ఇదంతా నీ స్వంతం అనుకో...." అంటూ ఖంగారుగా అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు.

అంతే!

తన జీవితం యిక్కడ స్థిరపడిపోయింది.

ఇంటిపని చూసుకోవటం. మిగతా తీరిక సమయం అంతా గుడిసెముందు నవారు మంచంపై కూర్చుని ఈ చెట్టుతో కాలక్షేపం చెయ్యటం.

అది ఎండి ఆకులు రాలుస్తుంది. తరువాత చిగిర్చి మొగ్గ తొడుగుతుంది. ఏ క్షణంలో దాని పూలు పిందెగా, పిందె కాయగా, కాయ పండుగా మారతాయో అన్నీ తెలుసు సంధ్యకి. ఏ కొమ్మ మీద ఏ పిట్టగూడు వుందో ఏ పిట్టకి ఎన్ని పిల్లలో.... ఎన్ని ఎగరగలవో–

సంధ్యకి నవ్వు వస్తుంది.

తనది మూగ ప్రేమ–

ఆ చెట్టుకీ మూగ ప్రేమే!

అందుకే తను ఇద్దరికి అంతగా అనుబంధం ముడిపడింది.

మాటా పలుకులేని చెట్టుతో బంధుత్వం ఏమిటి అని ఎవరైనా అనుకోవచ్చు కాని ఈ "మనసున్న మనుషులు" తనని ఏపాటి సేద దీర్చారని?.... కట్టుకున్న భర్త కాలరాయాలని చూశాడు. పెంచిన పిల్లలు పాలుత్రాగి రొమ్ముమీద తన్ని పొయ్యారు కోరి కోరి వెంటపడిన మనిషి తన మనసుని విరిచాడు. తెలిసీ తెలియని వస్సుప్రాయంలోనే "అమ్మ" లేదు.

పదమూడు సంవత్సరాలు పిన్నితోనూ, పది సంవత్సరాలు తన కసాయి భర్తతోనూ నిర్లిప్తంగా, నిర్జీవంగా గడిచి పొయ్యాయి. అసలు తన మనసుని, ప్రేమని ఎవరు అర్థం చేసుకున్నారని? అందరూ తన హృదయాన్ని గాయపరిచారు. "జీవితం—ప్రేమ=?" అన్న ప్రశ్న వస్తే జవాబు "సంధ్య". అవును, తను! జీవితం – ప్రేమ = తను.

కాని....ఈచెట్టు....మాటా పలుకూరాని ఈ చెట్టు తనని ఎంత ఆదరించింది! మూగగా తనని ఎంత ప్రేమించింది? మండే తన గుండెని ఎంత చల్లగా సేద దీర్చింది?

"కావ్.... కావ్...."

ఆలోచనల్లో మునిగిపోయిన సంధ్య చప్పున తేరుకుని తల ఎత్తింది

మోడైన మామిడి కొమ్మ మీద వొంటరిగా ఒకకాకి కూర్చుని యెందుకో.. అదే పనిగాఅరుస్తోంది. దానిఘోష దానిది. ఎవరికి అర్థం అవుతుంది?

సంధ్య జాలిగా ఆ వొంటరి పిట్టకేసి చూసింది. పాపం దాని బాధ ఏమిటో!

"కావ్....కావ్...." ఒక విధమైన ఆర్తి గొంతులో ధ్వనింపచేస్తూ కాకి అరుస్తూనే వుంది.

వెచ్చగా పడమటిగాలి విసిరింది. ఎండిన ఆకులు గలగలా శబ్దం చేస్తూ రాలిపడుతున్నాయి.

ఆ ఎండిన ఆకుల గలగలలమధ్య.... ఆ కాకి కూతల మధ్య సంధ్య అలాగే కూర్చుంది.


చీకూ చింతా లేని విరాగినిలా సర్వసంగ పరిత్యాగిలా నిర్లిప్తంగా నిర్జీవంగా.

చెట్టు శిశిరంలోనే మోడు అవుతుంది.

కాని సంధ్య బ్రతుకు! నిత్య శిశిరం!

## ఎందుకు

శిశిరం రాగానే
చెట్టెందుకు రాలుస్తుంది
పండుటాకుల్ని?
రాబోయే మండుటెండా కాలంలో



దట్టమైన కొత్తఆకుల విప్పిన
గొడుగుల్ని
శ్రమజీవుల కోసం
సమకూర్చడానికి.

డాక్టర్ పి. యల్. శ్రీనివాసరెడ్డి